


నాకు కర్నాటకసంగీతమంటేనూ, అందులో ముఖ్యంగా త్యాగరాజకృతులంటేనూ భక్తి కలిగించిన వ్యక్తి మా లలితపిన్ని ఒక్కతే. అదివరలో త్యాగరాజకృతులు చాలామంది పాడగా విన్నాను. ఎక్కువగా అయ్యర్లనోట విన్నానేమో, అవంటే నాకు పరమ అసహ్యం పుట్టుకొచ్చేది. 'శాస్త్రకట్టు' సంగీతమంటే సరిగమలతో ముడితప్ప మరేమీ లేదనే దురభిప్రాయంలో పడ్డాను.

లలితపిన్ని నాకంటె రెండేళ్లు చిన్న. ఆవిడకి పెళ్లికాకముందు ఏడాది కొకసారైనా మా యింటికి వచ్చేది. మా యింట్లో వున్న పాతహార్మోనియం వాయిస్తూపాడేది మొదటి సారిగా నేను ఆమెనోటివెంట 'సంగీతజ్ఞానమూ భక్తివినా' అనే కృతి విన్నాను. లలితపిన్ని సంగీతం పాడుతుందని నాకు తెలియదు. ఆమె పాట వినేసరికి సంగీతమంటే ఇదని నాకు మొదటిసారిగా తెలిసింది. అదివరకు నే నెన్నోసార్లు విని విసుగెత్తిన కృతులే ఆమెకంఠంలో కొత్త అర్థాలు వ్యక్తంచేసేవి.

"పిన్నీ! ఇంత చిన్నతనంలో ఇంత గొప్ప సంగీతం ఎక్కడ నేర్చావు?" అని నే నడిగితే,

"నిజంగా అంత బావుందా నా పాట?" అని అమాయికంగా అన్నది.

నిజానికి ఆమెకా సంగీతం నేర్చుకుంటే వచ్చిందని నేను నమ్మను. ఆమెకి మా తాతగారు సంగీతంమేష్టరును పెట్టి వీణ నేర్పించారు. కాని ఆమె వేసే స్వరాలు, సంగతులు ఇదివర కెక్కడా నేను వినలేదు. అయినా ప్రతిస్వరం అదివరకే పరిచితం, సన్నిహితం అయినట్టుగా నాలో కరిగిపోయేది. తరవాత కొన్నేళ్లకి ఫిడేలునాయుడు

గారి గానం విన్నతరవాతగాని మా పిన్ని కంఠానికి సరియైన ఉపమానం దొరకలేదు.

ప్రతి వేసవికాలంసెలవులికీ మా అమ్మమ్మగారి వూరు వెళ్లేవాణ్ణి. చాలాసార్లు ఆరుబయట వెన్నెల్లో కూర్చుని ఆమె వీణవాయిస్తూ పాడుతుంటే విన్నాను.

"ఒరే నువ్వు పాడరాదురా, అస్తమానమూ నన్ను పాడమనకపోతే?" అని ఒకసారి నవ్వుతూ అడిగింది పిన్ని.

"సరిసరి, నువ్వు పాడింతరవాత గొంతెత్తటానికి ఎన్ని గుండె లుండాలి?" అన్నాను.

కాలేజీలో స్నేహితులముందు సినిమా ట్యూనులు పాడి గర్వపడే నేను మా పిన్ని ముందు కంఠమెత్తటానికి కూడా జడిసేవాణ్ణి.

"ఒక్క సినిమాపాట పాడరా, వినాలనుంది. ఆయ నెవరు సైగలా, ఎవరో? ఆయనపాట వినిపించు," అని బలవంతం చేసింది పిన్ని.

చివరికి పాడక తప్పింది కాదు. కాని రెండు చరణాలు పాడానో లేదో, పిన్ని పాట తలపుకు వచ్చి, సిగ్గుపడి ఆపేశాను.

"పిన్నీ! ఇప్పుడు కాదు. తరువా తెప్పుడన్నా పాడతానులే. నీ పాట నా చెవుల్లో మోగుతున్నంతసేపూ నేను పాడటం అసాధ్యం," అన్నాను.

ఆమె పాడిన కృతులు సముద్రమంత విశాలమూ, అగాధమూ అయినవి. నా పాటలు పిల్లకాలవల్లాంటివి. పిల్లకాలవల్లో సౌందర్యం లేకపోలేదు. కాని సముద్రంముందు కాదు వాటి దర్పం.

మా పిన్ని కొంచెం చామనచాయగా వున్నా, కళా కాంతీ ఉట్టిపడే ముఖం. ఆమె ఎక్కడ ఉన్నాసరే ఆచోటుకి ఒక నిండు, శోభవచ్చేది. ఎక్కడో దూరాలకు చూస్తున్నట్టుగా ఉండేవి ఆమె విశాలమైన కోలకళ్లు. బరువుగా అడుగులు వేస్తూ, నిదానంగా నడిచేది. మాటకూడా నిదానంగా, సౌమ్యంగా ఉండేది. ఆమెకి కోపంరావటంగాని, తొందరపడటంగాని నే నెప్పుడూ చూడలేదు.

ఆమె వ్యక్తిత్వంలోని గొప్పతనమంతా ఆమె సంగీతంలో ప్రతిఫలించేది.

ఆమె నాకంటే రెండేళ్లు చిన్నది కావటంవల్లనేమో మొదట్లో "పిన్నీ!" అని పిలుస్తుంటే ఏమిటోగా వుండేది. కాని ఆమె పాట విన్నప్పుడల్లా ఆమెదగ్గిర చంటిపిల్లడివలె అయిపోయేవాణ్ణి. ఆమెని ఆమె సంగీతంనుండి వేరుగా చూడలేకపోయాను. ఆమె కళాప్రతిభమీద నా కుండే ఆరాధనే ఆమెమీదకూడా ప్రసరించేది.

సముద్రతీరాన ఒంటరిగా విశాలాకాశం కింద నిలబడినప్పుడు మానవుడికి తన అల్పత్వం గోచరిస్తుంది.

ఎప్పుడూ మే మిద్దరం కలిసి తిరిగేవాళ్లం. మా దొడ్లో జామచెట్టెక్కి ఆమెకి పళ్లు కోసిపెట్టేవాణ్ణి. సెలవులికి వచ్చినప్పుడల్లా ఏవో కథల పత్రికలూ, నవలలు తెచ్చి చదివించేవాణ్ణి. కొత్తగా చూసిన సినిమాకథలు, పాటలు వినిపించేవాణ్ణి. నాకు ఆమె కృతులు నేర్పేటట్టు, నేనామెకి సినిమాపాటలు నేర్పేటట్టు ఒడంబడిక చేసుకున్నాం. కాని నాకు ఆ స్వరాలు నోరు తిరిగేవే కావు. ఆమె నా సినిమా పాటల్ని ఎంత నేర్చుకున్నా ఎక్కడో కర్ణాటకబాణీ దొర్లేది. దాంతో మా ఒడంబడిక రద్దుచేసుకున్నాం.

## 2

నైజాములో ఏదో పల్లెటూరిసంబంధం వెదికి మా పిన్నికి పెళ్లిచేశారు.

ఆమెఅత్తవారు చాలా భాగ్యవంతులు. ఆమె భర్తకి పాతికేళ్లుంటాయి. కొత్తగా కరిణీకంలో ప్రవేశించాడు. సాంప్రదాయం గల కుటుంబమనీ, డబ్బున్నవాళ్లనీ మా తాతగారు ఆ సంబంధం చేశారు. లలిత పిన్ని ఆ మారుమూల పల్లెటూరికి కాపరానికి వెళ్లిపోయింది.

వెళ్లిన కొత్తలో ఆమెని అత్తవారు మూడు నాలుగు సార్లు పుట్టింటికి పంపించారుగాని తరవాత క్రమంగా మానివేశారు. నే నొకసారి కాలేజీనుంచి పెద్ద ఉత్తరం రాశా నామెకి "పిన్నీ! నీ సంగీతం ఎప్పటికీ మర్చిపోలేను; నీ కంఠంలాంటి కంఠం నాకు మళ్లీ వినబడలేదు. నువ్వు నా ఆరాధ్యదేవతవి," అని. ఆ కవర్లో నే నా అడ్రసు రాసి మరోకవరు కూడా వుంచాను, ఆమె సమాధానం రాయటానికి పనికొస్తుందిగదా అని. దాని కామె సమాధానం రాయలేదు అప్పటికీ, యిప్పటికీ.

నాలుగైదేళ్ళతరవాతగావును, మాఅమ్మ ఒకసారి చెప్పింది పిన్నిసంగతి.

"విన్నావురా? లలితమ్మని దాని అత్తారు నానాబాధా పెడుతున్నారుట."

"ఏం, ఎందుకూ?" అన్నాను ఆశ్చర్యపోయి.

"ఏమో మరీ. కొత్తలో దాన్ని బాగానే చూశారు. తరవాత వాళ్లకేం పొయ్యేకాలం వచ్చిందో మరి? పాపం 'లలితమ్మ ఆ లంకలో ఎన్ని కష్టాలు పడుతున్నదో? ఎప్పుడన్నా వెళ్లి చూద్దామంటే దగ్గిరా, దాపా?"

"నే నోసారి వెళ్లి చూసొస్తానే, అమ్మా! లలితపిన్నిని చూసి చాలా ఏళ్లయింది"

"సరేలే. నువ్వు వెళ్ళటంకూడానా! వాళ్లసలే దానిపై లేనిపోని అపనిందలు మోపి హింసపెడుతున్నారు. వీళ్ల అనుమానాలూ, వీళ్లూ విరగడైపోనూ," అని అమ్మ లోపలికి వెళ్లిపోయింది.

లలితపిన్నిని చూసి ఎన్నేళ్ళయింది? ఆమె నా ప్రపంచానికి ఎంత దూరమైపోయింది? ఎప్పుడో విని మరచిపోయిన ఆమె మధురకంఠపు జ్ఞాపకం ఇప్పటికీ నన్నెందుకిల్లా ఆరాటపెడుతుంది?

ఇంతకాలమైనతరవాత వెనక్కి తిరిగి చూసుకుంటే, ఆ చిన్నతనంలో జరిగిన సంఘటనలు మసకచీకట్లో నీడల్లా అస్పష్టంగా కళ్లకి కట్టి వేధిస్తాయి.

ఆమెపెళ్లి జరుగుతున్నప్పుడు నేను తీవ్రంగా గాయపడ్డాను. నన్ను లోకమంతా వంచించినట్టు, నాకొక్కడికే చెందిన ఒక అమూల్య వస్తువును ఎవరో దొంగిలించినట్టు, ఎందుకో ఆవేదనపడ్డాను. ఆమె అత్తవారింటికి వెళ్లినతర్వాత నా జీవితంలో గొప్ప వెలితి ఏర్పడ్డట్టు బాధపడ్డాను.

అది వైశాఖమాసం. నాకు మావాళ్లు పెళ్లి నిశ్చయపరిచారు. బంధువులందరికే శుభలేఖలు పోస్టువేశాము. లలితపిన్నిప్రసక్తి వచ్చింది.

"నేను వెళ్లి పిన్నిని తీసుకువస్తానమ్మా" అన్నాను మా అమ్మతో.


"ఎందుకురా వెళ్లటం? వాళ్లు పంపిస్తారా, ఏమన్నానా? శుభలేఖ వేస్తే సరిపోతుంది," అన్నది మా అమ్మ.

"కాదమ్మా! నేను వెళ్లి పట్టుబడితే వాళ్లు తప్పక పంపిస్తారని నా నమ్మకం," అన్నాను

వా ళ్లామెని పంపిస్తారని నాకు ఏకోశానా నమ్మకం లేదు. కాని యీ వంకతో


వెయ్యిరూపాయిలు పొందండి

సునాయాసముగా ఆర్జించినట్లే మీరు రూపాయిలు పొందగలుగుతారు. నేడే ఈ విలాసానికి వ్రాయండి. Calico Silk Co. Post Box 106, Calcutta 1.



వెళ్లి పిన్నిని చూసినట్టవుతుందికదా అని నా ఉద్దేశ్యం.

చివరి కెలాగయితేనేం మా అమ్మని వొప్పించి లలితపిన్నిని పిలుచుకురావడానికి బయల్దేరాను. ఆవూరు మా అమ్మమ్మగారి వూరికి నలభైమైళ్ళ దూరం వుంది. అడవుల్లో పడి, మట్టిరోడ్డుమీద, బండి కట్టించుకుని పోవాలి. మా తాతయ్యా, నేనూ కలిసి వెళ్లాం.

మా తాతయ్య బలే సర్దామనిషి. పూర్వకాలపువాడు కావటంమూలాన ఏ పది మైళ్లో తప్ప తక్కిన దూరమంతా చకచక బండివెనకాలే నడిచాడు. దోవపొడుగునా ఏవో కబుర్లు చెప్పి నన్ను నవ్వించాడు.

"తాతయ్యా! ఇక బండి ఎక్కరాదా?" అని నే నంటే,

"ఒరేయ్. ఇదో నడకట్రా? నా చిన్నతనంలో పాతిక ముప్ఫయి మైళ్లు చులాగ్గా ఒకరోజులో నడిచేవాణ్ణి. ఇప్పటికాలపు సన్నాసులు మీ రెందుకు పనికివస్తార్రా? పట్టుమని పది మైళ్లు నడవలేరు!" అన్నాడు.

## 3

లలితపిన్ని అత్తారూరు ఆ మర్నాటి మధ్యాహ్నానికి చేరుకున్నాం. ఎండ మంచి తీవ్రంగా వుంది. వడగాలి ఆ చెవినుండి ఈ చెవికి రివ్వున కొడుతోంది. ఆ పల్లెటూరి వీధుల్లో ఆ మధ్యాహ్నవేళ పిట్టయినా తిరగటంలేదు. నాగరిక ప్రపంచానికి ఎటు చూసినా యాభైమైళ్ల దూరంలో వున్న ఆ గ్రామపు దృశ్యం నాకు చెప్పలేని దిగులుపుట్టించింది. ఈ వూళ్లో లలితపిన్ని యిన్నాళ్లూ ఎలా నివసించగలిగిందా, ఆమె నిశ్చలమైన చూపులు ఇంకా అలానే అందరాని దూరాలకు చూస్తూనే వుంటాయా, అనిపించింది.

వెళ్లగానే లలితపిన్ని మొగుడు వాకిట్లో కనిపించాడు. మనిషి గాలికొట్టిన ఫుట్‌బాల్ బ్లాడర్‌లా, దొందగా వున్నాడు. కోరమీసాలు, నీరుకావిబట్టలు, నోట్లో చుట్ట అంతా పల్లెటూరి వాలకం. ముప్ఫయ్యేళ్ళ మనిషైనా నలభైఏళ్ల వాడిలా వున్నాడు. మామగార్ని చూడగానే ఆశ్చర్యం కనబరిచాడు.

"అమ్మా! మామగారొచ్చారు. కాళ్లు కడుక్కోటానికి రెండు చెంబుల్తో నీళ్లు తీసుకురా," అని కేకేశాడు నాకేసి తేరిపారచూస్తూ. "కొంచెం పనుంది, వెళ్లి వస్తాను," అని మళ్లీ నాకేసి ఒకసారి చురచుర చూసి వెళ్ళిపోయాడు.

"అంతా క్షేమమా?" అని లలితపిన్ని అత్తగారిని మా తాతయ్య కుశలప్రశ్న వేశాడు. నన్ను ఫలానా అని తెలియజేశాడు.

"ఆ పెళ్లప్పుడు చూశాగా యీ అబ్బాయిని!" అని మూతి తిప్పుకుంటూ అన్నదావిడ.

ఇంతల్లో అయిదేళ్ల మగపిల్లడొకడూ, మూడేళ్ళ ఆడపిల్లా అక్కడికి వచ్చారు. తాతయ్య వాళ్లని దగ్గిరికి తీసుకుని, "వీళ్లనెప్పుడేనా చూశావురా?" అని నన్నడిగాడు.

"చూడలేదు. లలితపిన్ని పిల్లలేనా?"

"ఊఁ. మరింకెవరనుకున్నావ్? ఒరే అబ్బీ! ఆయ నెవరో తెలుసా?" అని తాతయ్య పిల్లవాడి నడిగాడు.

"తెలవదు." అన్నాడు వాడు.

"మీ అన్నయ్యరా ఆయన."

"నా కన్నయ్యేంటి? ఆయ నెవలో?" అన్నాడు వాడు.

నిజానికి ఆ పిల్ల లెవరో, నే నెవరో? వాళ్లకీ నాకూ ఏమిటి సంబంధం? వాళ్లకేసి చూస్తుంటే వెయ్యామడల దూరంలో నుంచున్నట్టుగా కనిపించారు.

ఇంతలో లోపలనుండి ఒకామె వచ్చింది, చంకలో చంటిపిల్లని వేసుకుని.

"ఏం నాన్నా! ఎప్పుడొచ్చావు? అంతా కులాసాగా వున్నారా? ఏమయ్యోవ్ నువ్వేనా? పెద్దవాడి వయ్యావే? జ్ఞాపకమున్నానా?"

"అహ, జ్ఞాపకం లేకేం?" అన్నాను

కాని ఆమె ఎవరు? లలితపిన్నిపోలికలు కొద్దికొద్దిగా స్పష్టపడుతున్నాయి. మొహాన ముడతలు, లోతుకుపోయిన కళ్లు, వాటికింద నల్లటి చారలు, కుంగిపోయిన బుజాలు, పుల్లల్లాంటి కాళ్లు ఎత్తెత్తి వేసుకుంటూ... నా లలిత పిన్నేనా ఈమె? ఇలా అయిపోయిందేం? ఏడేళ్లనించీ ఏ స్త్రీరూపం నా మనస్సులో నిరంతరం నటించిందో ఆ లలితపిన్నేనా ఈమె?

నేను నిశ్చేష్టుణ్ణయి ఆమెకేసే చూస్తున్నాను. ఆమెని చూశాక నాకు పూర్వపు లలితపిన్ని ఎంత గుర్తుకు తెచ్చుకున్నా జ్ఞాపకం రావటంలేదు.

ఆమె చంకలోని చంటిపిల్ల కొత్తవాళ్లని చూసి కాబోలు కావురుమంది. అప్పటికి నేను తెప్పరిల్లాను.

"అదేమిటే, అమ్మాయ్! మరీ అంత నీరసించిపోయావ్?" అంటున్నాడు తాతయ్య.

"అబ్బే. ఏంలేదు, నాన్నా!" అన్నదామె.

"ఏమీ లేకపోవట మేమిటి? కిందటిసారి నేను చూసినప్పటికంటే బాగా చిక్కావ్, వంట్లో బాగుండలేదా?" అన్నాడు తాతయ్య. రెండు కన్నీటిబొట్లు ఆయన కళ్లచివరలదాకా వచ్చి ఆగిపోవటం చూశాను నేను.

"ఆ, ఏమోనండి! మీ పిల్ల వట్టి రోగిష్టిమనిషి," అని ఇంకేదో సణుక్కుంటూ అత్తగారు లోపలి కెళ్లిపోయింది.

నేనూ, తాతయ్యా దొడ్లో నూతిదగ్గిర స్నానాలు చేశాం. పిన్ని అప్పటికప్పుడు మడికట్టుకుని మాకోసం వంట చేసింది.

భోజనాలదగ్గిర ఎవ్వరం మాట్టాడలేదు. తరవాత పిన్ని ఆకు వక్క చుట్టి నాకూ, తాతయ్యకీ యిచ్చింది. ప్రయాణంబడలిక మీద వున్నామేమో, వసారాలో మంచాల మీద వళ్లు వాల్చామో లేదో సుఖమైన నిద్రపట్టింది.

సాయంత్రం ఆరుగంటలకి కొద్దిగా చల్లపడింది. నేను బట్టలు వేసుకుని ఊరిబైటకి షికారుగా వెళ్లాను. ఊరంతా పూరిగుడిసెలే. పెంకుటిళ్లు అరుదుగా కనిపించాయి. నేలంతా ఎర్రదుమ్ము. ఆ వూళ్లోవాళ్లు ఇస్త్రీబట్టలు వేసుకున్నవాళ్లని ఎప్పుడూ చూసివుండరేమో, దోవపొడుగునా నిలిచి వింతజంతువుని చూసినట్టు చూశారు నన్ను.

ఆరాత్రి భోజనాలదగ్గిర మా తాతయ్య మేము వచ్చిన సంగతి చెప్పాడు. నా పెళ్లికి అందర్నీ రమ్మని అడిగాడు.

"మా కెక్కడ వీలుకుదురుతుందీ రావటానికి" అన్నది అత్తగారు.

"పోనీ లలితపిన్నినైనా పంపించండి. పెళ్లికాగానే ఎవరమన్నా వచ్చి దిగబెడతాము," అన్నాను నేను.

"ఆ, అదెక్కడ వస్తుందిలే. జబ్బుమనిషి, చంటిపిల్లతల్లి," అందావిడ.

మా కింక ఏమనాలో తోచలేదు. తలుపుచాటునే నుంచుని వుంది పిన్ని.

"ఆట్టే రోజు లుండను, అత్తయ్యా! పెళ్లి అయినవెంటనే వచ్చేస్తాను. మా అక్కయ్యని, పిల్లల్ని చూసి చాలా ఏళ్లయింది," అన్నది బెరుకుగా.

"ఊఁ, వెడతావు; మా చక్కగా వెడతావు. నీ పాడుమొహం పెటుకుని అక్క—

గనోక్యూర్
అన్నిసెగలకు గంటలలోగుణము
ఈశ్వర ఫార్మశీ, రాజమండ్రి.

డికి వెళ్ళకపోతే వచ్చిన నష్టమేమీ లేదులే. చూశావుగా నువ్విన్నాళ్ళూ కలవరిస్తున్న మీ అక్కయ్యకొడుకుని," అని కసిరాడు పిన్ని మొగుడు.

పక్కన పెద్దవాడు, మామగారు ఉన్నారన్నైనా ఆలోచన లేకుండా ఆ మాట లన్నవాడిని పీటపెట్టి నెత్తి పగలగొడదామా అన్నంత కోపం వచ్చింది. అన్నందగ్గిర్నించి లేచిపోవా లనిపించింది. మా తాతయ్య 'శాంతించు' మన్నట్టు నాకేసి చూశాడు. పిన్ని తలుపుచాటునించి అవతలకి వెళ్ళిపోయిన చప్పుడు వినిపించింది.

భోజనాలు అయినాయో లేదో పిన్ని మొగుడు చెప్పులుతొడుక్కుని కఱ్ఱపట్టుకుని ఎక్కడికో వెళ్ళిపోయాడు.

పిన్ని నాకూ తాతయ్యకీ దక్షిణపువేపున మల్లెపందిరికింద పక్కలు వేసింది. తాతయ్య వీధిఅరుగుమీద చుట్ట కాలుస్తూ మా బండి తోలుకొచ్చిన వెంకన్నతో మాట్లాడుతున్నాడు. నేను పందిరికింద మంచంమీద పడుకుని, ఎఱ్ఱగా నిప్పుముద్దలా, కళా కాంతీ లేకుండా ఉదయిస్తున్న తదియచంద్రుణ్ణి చూస్తున్నాను. మల్లెచెట్టు విరగబూసింది. కన్నీటిబొట్లలా అప్పుడప్పుడు బాగా విచ్చిన పువ్వులు నామీద రాలుతున్నాయి.

మరచెంబులో నీళ్లు తీసుకుని పిన్ని వచ్చింది. తలవేపున చెంబు పెట్టి తాను తాతయ్యమంచంమీద కూర్చుంది.

"పిన్నీ! నువ్వు వచ్చేసెయ్యి. వీళ్లేమన్నా సరే, నేను తీసుకువెళ్లదలుచుకున్నాను," అన్నాను.

"ఎలా రమ్మంటావయ్యా, వాళ్లు వద్దంటూంటే? పట్టుకు లాక్కెళతావా?" అన్నది నీరసంగా, రాని నవ్వు తెప్పించుకుని.

"పిన్నీ! ఎందుకిలాగై పోయావ్ నువ్వు?"

"ఏంచేస్తాను, నా ఖర్మ! ఏ జన్మలో ఏం పాపం చేసుకున్నానో యీ యింట్లో పడ్డాను."

"కాదు, పిన్నీ! ఇది నీ పాపం కాదు. దీనికి బాధ్యత పూర్తిగా తాతయ్యదే."

"ఆయన తప్పేముంది? పెళ్లి చేసినప్పుడు కలగన్నాడా, వీళ్లిట్లాంటివాళ్లని?"

"నువ్వు ఇంకా సంగీతం పాడుతున్నావా, పిన్నీ!"

ఈ ప్రశ్న వినగానే ఆమె మొహం మరోవైపుకి తిప్పింది. ఆ గుడ్డివెన్నెల్లో ఆమె జొటజొట కన్నీళ్లు కార్చటం కనిపించింది.

"ఎందుకేడుస్తున్నావు, పిన్నీ!"

ఆమెకి దుఃఖం పుక్కిలింతలుగా వచ్చింది. వెక్కివెక్కి బిగ్గరగా ఏడ్వసాగింది.

"ఊరుకో, పిన్నీ! ఇంట్లో వాళ్లు వింటారు," అన్నాను, నా కళ్లనీళ్లు తుడుచుకుంటూ.

ఆమె ఏడుపు నాపింది కాస్సేపటికి—

"ఇన్నేళ్లలోనూ నన్నీ ప్రశ్న అడిగినవాడివి నువ్వొక్కడివే. అందుచేత ఏడుపు నాపుకోలేకపోయాను. నేను ఇక్కడికి కాపరానికొచ్చేటప్పుడు నా వీణ తెచ్చుకున్నాను. జ్ఞాపకం వుందా?" అన్నది.

"అవును. జ్ఞాపకముంది. ఆ వీణని ప్రాణంతో సమానంగా చూసుకునేదానివి కూడాను."

"దాన్ని మా ఆయన విరగ్గొట్టిపారేశారు. పాడుతున్నట్టు వినిపిస్తే గొంతు పిసికిచంపేస్తానన్నారు. నాకు సంగీతంరావటం వాళ్లకిష్టంలేదు. ఒకటి రెండు సార్లు నేను పాడుకోబోయాను. 'భోగందానిలా ఆ పాటలేమిటే?' అని మా అత్తగారు నన్ను గదమాయించి పాటలు మానిపించారు. ఇప్పుడు నాకు సంగీతంమీద ఇదివరకటి శ్రద్ధా లేదు, పాడుకునే ఓపికా లేదు," అన్నది పిన్ని నిస్పృహగా.

"పిన్నీ! ఒక్కమాట అడుగుతాను, కోపం రాదుగదా?"

"ఏమిటది?"

"నీమీద ఏవో అపనిందలు వేశారుట, నిజమేనా?"

"ఆ, అవన్నీ యిప్పుడెందుకులే?"

"కాదు, చెప్పు పిన్నీ. నిజమేనా?"

"నువ్వు కొత్తలో ఉత్తరం రాశావు చూడు. ఆ ఉత్తరం మా ఆయన చూశారు. దాంతో అనుమానపడి నన్ను నానా మాటలూ అని కొట్టారు. ఆ తరవాతకూడా ఊళ్లోవాళ్లతో లేనిపోనివి కల్పించి బాధపెడుతూనే వున్నారు. ఏ పాపమూ ఎరక్కపోయినా నాకీ అపనిందలు తప్పలేదు. ఇక నా బతుకంతా యిలాగే తెల్లవారిపోవలసివుందేమో?"

రెండు నిమిషాలసేపు ఎవ్వరం మాట్లాడలేదు.

"నే నా వుత్తరం రాయడం చాలా తెలివితక్కువే. నా పొరపాటు క్షమిస్తావా, పిన్నీ?"

"ఇందులో నువ్వు తెలిసి చేసిం దేముంది, క్షమించటానికి? అప్పుడు నా పెళ్లిలో నువ్వు అస్తమానమూ నా కూడాకూడా తిరిగేవాడివి జ్ఞాపకం వుందా? అప్పుడే మా ఆయన తల్లితో అన్నారుట, 'ఎవరా అబ్బాయి, పోకిరీమొహం వేసుకుని దాని వెంట తిరుగుతున్నాడు?' అని."

"పిన్నీ! నువ్వెంత కాదన్నా, నీ కష్టాలకు కొంతవరకు నేనుకూడా కారణమైనట్టు తోస్తున్నది. నిన్నీ నరకంలోనుంచి ఎలా రక్షించగలనా, ఏం చేస్తే నీ కష్టాలు గట్టెక్కుతాయాఅని వేదనపడుతున్నాను."

"సర్లే, నువ్వేం చేస్తావు నాకోసం? నువ్వు రేపు లక్షణమైన పిల్లని చేసుకోబోతున్నావు. నువ్వు సుఖంగా వుంటే నాకదే చాలు. ఈ పిల్లల్ని చూసుకుంటూ ఇలాగే కాలం గడుపుతాను."

"ఎంత మారిపోయావ్, పిన్నీ! మన చిన్నప్పటిరోజులు తలుచుకుంటే ఏడుపు వస్తున్నది. ఆ సుఖదినాలు మళ్లీ ఎప్పటికన్నా వస్తాయా? నీమీద నాకు అంత గౌరవం కలిగించింది నీ సంగీతమే. నీ కంఠంలో అప్పటి అమృతపు నదులు ఎక్కడ యింకిపోయాయి? అప్పుడు పాడేదానివి, 'శ్రీరామపాదమా! నీ కృప చాలునే' అని అమృతవాహినిరాగంలో ఒక కృతి. జ్ఞాపకం వుందా? ఆ ఒక్క ముక్క అనవూ, వినాలనుంది."

"సర్లే. ఇప్పు డేమిటి? అవన్నీ ఎప్పుడో మర్చిపోయాను," అన్న దామె.

ఇంతలోకే అత్తగారు "ఓ లలితమ్మా! ఎక్కడున్నావమ్మా తల్లీ!" అని కేకేసింది. పిడుగుపడ్డట్టు ఉలిక్కిపడ్డాం యిద్దరమూ. పిన్ని లేచి వెళ్లిపోయింది గబగబ, కాళ్లు ఎత్తెత్తి వేసుకుంటూ......

నా కా రాత్రి నిద్రపట్టనేలేదు. తెల్లవారుకట్ట ఏ గంటో నిద్రపోయివుంటాను. లేచేసరికి పక్కమీద ఒత్తుగా మల్లెపువ్వులు రాలి వాడి నలిగిపోయివున్నాయి. అవన్నీ ఏరి పొట్లంకట్టి నా సంచీలో పదిలపరిచాను.

పొద్దున్నే మొహం కడుక్కుని నేనూ, తాతయ్య బండికట్టుకుని తిరుగుముఖం పట్టాము. ముసలాయన ఆ ఒక్కరోజులోనే నెలరోజులు లంకణాలుచేసి నవాడల్లే

(15వ పేజీ చూడుడు)

**కుష్ఠు ★ బొల్లి**

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటీ చికిత్స, క్యాటలాగు ఉచితం.

జి. వి. రెడ్డి అండ్ కో., "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూర్పు గోదావరిజిల్లా.,

"పెతిదీ ఎవురిగ్గావాలా? రేత్తిరిపూట పెట్టెలో వుండ ఎర్ర కండవాతో ఏం పనొచ్చిందా అనడిగా, తప్పెట్టా?" అంది అమ్మ.

"ఎవు డన్నాడు తప్పనీ. దురగమ్మకు మల్లే అ డేదో మూల కూకుండా వచ్చుకుంటే అప్పుడే తగుల్కొంటివి. వూరక నే పెట్టెలో వుంటే ఏసుకుంటుండా. కొనుక్కు తెచ్చుకుండది ఏసుకుంటానికి కాదెట్టా?" అన్నాడు అయ్య.

"ఏసుకుంటే ఎవురి కేం బట్టిందీ. యిన్నాలనించి పెట్టెలో వూరక నే వుండదిగా. యీ రేత్తి రేం పనొచ్చిందీ?" అంది అమ్మ.

"బువ దిన్నాక ఎంకయ్య ఓ పాలి రామంటే ఎల్తుండాలే-సానా పనుండెది-నువ్వూరికే బురదమట్టి ఎగిరిన ట్టైగరమాక" అన్నాడు అయ్య.

"బురదమట్టు గిరదమట్టు అనమాక. అయితే ఎంకయ్య ఎర్రకండవా ఏసుకుని గాని రావద్దన్నాడెట్టా?" అంది అమ్మ.

"ఎహె రమ్మన్నేదులే, రెక్కొంప తగుల్కొంటట్టు తగుల్కొండావూ. పెట్టెలో సెదపురు గేమన్నా సేరిందేమోనని సూసి పానీగండా అని వూరక నే కండవా ఏసుకుంటే రాగం మొదులుబెట్టావే యిదవ కురడా?" అన్నాడు అయ్య.

"ఆహాఁ అట్టనా-అయితే కూసేపుండు. నా ఆకుపచ్చ కోకగ్గూడ సెద లేమన్నా పట్టినయ్యేమో సూడనీ-"

"సెదలేం పట్టలేదు గానీ ఇపుడు నీ కోకలు గీక లేం తియ్యమాక-అహాఁ-అదేందీ పచ్చకోక కట్టుకుంటుండదీ!" అంటున్నాడు అయ్య.

"వూరక నే కట్టుకుంటుండాలే. కోకలు కొనుక్కుండది కట్టుకుంటానిక్కాదెట్టా? వుంపెట్టా-" అంటున్నది అమ్మ.

"ఇదిగో - అదేందీ తలగూడ దువ్వక్తే ఇదిగో ఏందమ్మోవ్ నీ యవారం!" అంటున్నాడు అయ్య.

"యవారమా? సెబతాలే పద-"

"ఇదేంది -యీంకి అటుబోతావు తలుపు కాడికే?" అంటుండాడు అయ్య.

"ఎంకయ్యకాడ సాకూ పనంది. ఎద్దాంపదా" అంది అమ్మ.

"ఎంకయ్యా! ఎంకయ్య ఎవురూ? అయితే ఎంకయ్యని అట్టాంచు. ఇదిగో నమ్మోవ్ నువు బొమ్మలాట గిమ్మలాటకని పచ్చకోక గట్టి బయలెల్తుండావుగావాఁల మరదేందో-" అన్నాడు అయ్య.

"ఎంకయ్య ఎవురంటంకాడికొచ్చిందీ? అయితే ఎర్రకండవా ఏసింది బొమ్మలాట కాడికా అయ్యా? హుఁ అంత దొంగ సాటుగా ఎల్లాలొచ్చిందా అయ్యా! నాకు తెలవదనుకుండా నీ ఏసిగాలూ-వుండు తెల్లాగెగు స్తేమావూరు మాఅమ్మ అయ్య కాడి కెల్లకబో తేసూడు. ఎల్లకబోతే నా పేరు దురగమ్మ కాదనాల్సిందే. ఎంతన్యాయం! ఎంత మాయా! అన్నీ దొంగమాటలే, అంతా బూటకమే! మామ్మ, మాఅయ్యే గనక వుంటే ఈ మడిసి ఇట్టా జెత్తాడూ - హుఁ హుఁ - అమ్మఁ!"

"దురగమ్మతల్లీ యాడవమాకే నీకు దణ్ణం పెడతా, బుద్ధి గెడ్డి తిందిలేవే -"

"వుండూ-నన్నంటుకోమాకా-అమ్మ-"

"పెద్దగా అరవమాకే తల్లా - యీ సూరాయన్నా వొత్తే బాగుండు. యదవ రాడేం ఏ యాలకూ - బొమ్మలాటకెల్దాం యిగ వూరుకోవే -"

"ఏం అక్కర్లా నువే ఎల్లు ఎర్రకండవాతో, సూరాయి నేనూ ఎటుబోతే నీకేం"

"అహాఁ అదుగందుకే - ఎదవ పనే జేశా- యాడో గజ్జల సప్పుడవుతుందే - యీ సూరాయి వొత్తే బాగుండు. దబ్బున బొమ్మలాట కెల్లొచ్చు - పాటలు యినొస్తుండయి మొదులు బెట్టలేదుగెందా - ఎవురాడా- సూరాయ్? ఏందిరా తలకాయి లోనికి బెట్టి అట్ట సూత్తుండావూ - చా యదవా-దబ్బున రామంటుంటే - ఎంకట్సుబ్బయ్యగోరితో సెప్పొచ్చావంట్రా?"

"మరే - ఆరు అటెల్తేనీ -" అన్నాడు సూరాయి లోనకొచ్చి అటనే గోడ కానుకుని యీపు రుద్దుకుంటా.

"చా యదవా-" అంటున్నాడు అయ్య.

"ఆడిమీదకి లెగవమాక వుత్తపున్నానికి-యీ ఘుండదిరా నీగల్ల సాక్కోయా - ఎల్లి ఏసుకోవేందిరా?" అంది అమ్మ కళ్లు ఆడిస్తా.

"ఆ పెట్టెలో వుంది ఏసుకో లేరా దొబ్బనా?" అన్నాడు అయ్య.

ఆమయిన బయల్దేర్దం బయల్దేర్దం దాన్లో అమ్మా, అయ్యల్ని సందు సూసుకుని సల్లగా దాటేసి, బొమ్మలాటపందిరికి అసంట ఆళ్ల జేజికాడ కూకుని అటిటు నిక్కి నిక్కి సూత్తుండ సీతాయి జడతోక ఎనకమాలే ఎల్లి గబిక్కిన ఓ గుంజు గుంజి, సెక్కిలు, చీనారేకు డబ్బాలు దద్దనామంటా కేతిగాడు, బంగారక్క తెరమీనకు వొచ్చే యాలకి, యాపసెట్టుమీన కూకుండ కొండాయిచుటాను ఎడా పెడా తోసుకుంటా ఎల్లి సెట్టుమయాన వాలుకొమ్మ మీన కూకుండాడు సూరాయి.

---

# లలిత పిన్ని

(1[illegible]-వ పేజీ తరువాయి)

ఆయిపోయాడు. బండిలోనే కూర్చుని, తల వంచుకుని కుమిలికుమిలి ఏడ్చాడు.

బండితోలే వెంకన్న అన్నాడు:

"తాతయ్యగోరూ! బంగారబొమ్మ లాంటిపిల్లని యీ రొమదవసచ్చినోళ్ల కిచ్చారండీ! మీ యల్లుడి వూసు ఈ వూళ్లో ఎత్తితే సాలు అంతా తిట్టేవాళ్లే. ఎప్పుడూ మాలకూడెంలోనే ముండలమ్మట తిరుగుతాడంట. ఒళ్లంతా రోగాలేనంట, నా యాలకి," అన్నాడు.

"ఒరే, నువ్వూరికే వాగబోకురా. అసలే ఆయన కష్టపడుతున్నాడు," అన్నాను నేను కోపంగా.

"నీ కేం తెలుసుద్దయ్యా? నేను మీ తాతయ్యగోరింటో యింతప్పట్నించీ పని సేశా. ఆ పిల్ల ఎసుమంటి పిల్లో నాకు తెలవదనా? మాలచ్చిమంటి తల్లి. ఎన్ని కష్టాలు పడుతుండదో ఆళ్ల సేతుల్లో." అన్నాడు వెంకన్న. ఆ మాటలు విని తాతయ్య మరీ కుంగిపోయాడు.

## 4

ఎక్కడ త్యాగరాజకృతి విన్నా నాకు మా లలితపిన్నే జ్ఞాపకం వొస్తుంది. ఆమె సంగీతం గాని, కంఠంగాని ఇప్పుడు జ్ఞాపకం తెచ్చుకుందామన్నా జ్ఞాపకం రావు. పెళ్ళి కాకముందు ఎలా వుండేదో కళ్లు చించుకున్నా గుర్తుకు రాదు. కాని చంటిపిల్లని చంకన వేసుకుని ఎత్తెత్తి కాళ్లు వేస్తూ వచ్చి నన్ను పలకరించిన ఆ లలితపిన్నే జ్ఞాపకం వచ్చి మనస్సును రంపంకోత కోస్తుంది ఇప్పటికీ. ఆమెవ్యక్తిత్వానికి కేంద్రమైన వీణలాగానే ఆమెజీవితంకూడా భగ్నవీణ.

---

## నారసింహలేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము, నిక్కాక, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

పి. సి. ఏ. & కంపెని. "ఆయుర్వేదసమాజం"

పెరిదేపి-నెల్లూరు జిల్లా.